ప్రతి సోమవారం డయల్ యువర్ కలెక్టర్

కడప(కలెక్టరేట్), జూలై 20: ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లోతేటి శివశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ప్రతి సోమవారం ఉదయం 9-30 గంటల నుంచి 10-30 వరకు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

వైసీపీకి నో రూల్స్..!





- కోట్లాది రూపాయల స్థలాన్ని కారుచౌకగా లీజుకు..
- పార్టీ కార్యాలయ నిర్మాణంలో నిబంధనలకు నీళ్లు
- ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే రాజప్రసాదంలాంటి భవనం
- ఇది జగన్ జమానాలో జరిగిన తీరు

కార్పొరేషన్ పరిధిలో రెండు సెంట్లలో ఇల్లు కట్టుకోవాలన్నా, పెద్ద షాపింగ్ మాల్ అయినా, పార్టీ కార్యాలయం అయినా.. ఏ నిర్మాణం అయినా సరే టౌన్‌ప్లానింగ్ అనుమతి తప్పనిసరి. అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటే నిబంధనల ప్రకారం అనుమతులు ఇస్తారు. అయితే జగన్ పాలనలో మాత్రం ఈ రూలు అటకెక్కినట్లుంది. కడప కార్పొరేషన్ మేయర్‌గా సురేశ్ బాబు ఉన్నారు. ఆయనే వైసీపీ జిల్లా అధ్యక్షుడు. మరి టౌన్‌ప్లానింగ్ నిబంధనలు పాటించకుండానే వైసీపీ కార్యాలయ భవనం చేపట్టడం చూసి మేయర్ గారు మీకిది తగునా, రూల్స్ మీకు వర్తించవా అని ప్రశ్నిస్తున్నారు. సామాన్యులు, పేదలు అయితే రూల్స్ అంటూ అధికార యంత్రాంగాన్ని పంపి సినిమా చూపిస్తారు. మరి రెండు ఎకరాల స్థలంలో ఇంద్రభవనాన్ని తలపించే రాజప్రసాదాన్ని నిర్మిస్తున్నప్పుడు మనం అన్ని నిబంధనలు పాటించి అందరికి ఆదర్శంగా ఉండాల్సింది పోయి కడప కార్పొరేషన్ మాదే, స్టేట్‌లో గవర్నమెంటు మాదే.. మాకు రూల్స్ ఏంటి అనుకున్నారా అంటూ ప్రశ్నిస్తున్నారు.



కడప, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జగన్ సీఎంగా ఐదేళ్ల క్రితం కొలువుదీరగానే ప్రజావేదికను కూల్చివేసి పాలనకు శ్రీకారం చుట్టారు. అక్రమ కట్టడాలు సహించనంటూ నీతులు చెప్పారు. అయితే కేవలం ప్రజావేదిక కూల్చివేత, టీడీపీ నేతల ఆస్తులను ధ్వంసం చేయడానికి మాత్రమే రూల్సు ఉంటాయి. అదే వైసీపీ నేతలకు మాత్రం ఎలాంటి రూల్సు వర్తించవనేదానికి జిల్లా కేంద్రమైన కడపలో నిర్మించిన ఆ పార్టీ కార్యాలయమే ఉదాహరణ.

వైసీపీ జిల్లా కార్యాలయం నిర్మాణం కోసం రాజంపేట రోడ్డులోని రామాంజనేయపురం రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 424/7లో రెండు ఎకరాల పొలాన్ని సంవత్సరానికి రూ.1000 లీజుతో 33 సంవత్సరాలకు అద్దెకు ఇచ్చారు. ఈ మేరకు గత ఏడాది తహశీల్దార్ అప్పగించారు. పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకోవడాన్ని ఎవరూ తప్పుబట్టరు. అయితే ఎంతో విలువైన ఈ స్థలాన్ని రూ.1000కే అప్పనంగా లీజుకు కట్టబెట్టడంతో విమర్శలు వచ్చాయి. ఇక్కడ ఐదెకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ స్థలంలో చంద్రబాబు హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని భావించారు. ఆ తర్వాత జగన్ వచ్చాక జగనన్న ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కూడా తొలుత నిర్ణయించారు. ఇది చెన్నై రహదారి పక్కనే ఉండడంతో ఇక్కడ మంచి ధర ఉంది. చుట్టుపక్కల ప్రైవేటు వెంచర్లు వెలిశాయి. పేదలకు స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఉంటే ఆయా కుటుంబాలకు గొప్ప ఆస్తిగా ఉండేది. అయితే అలా కాకుండా వైసీపీ కార్యాలయానికి స్థలం తీసుకున్నారు.

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కడపలో అనుమతులు లేని లేఅవుట్లపై విరుచుకుపడ్డారు. కడప కార్పొరేషన్ ఏర్పడిన నాటి నుంచి కాంగ్రెస్, వైసీపీ చేతుల్లోనే పాలక వర్గం ఉంది. అప్పుడు కాంగ్రెస్‌లో ఉన్న వారే ఇప్పుడు వైసీపీలో ఉన్నారు. వీళ్ల జమానాలోనే లేఅవుట్లు వేశారు. కొందరు కార్పొరేటర్లు, వైసీపీ నేతలు కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి వెంచర్లు వేశారు. అయితే వాటిలో చాలా వరకు నిబంధనలకు వ్యతిరేకంగా వెలిశాయి. 40అడుగుల రోడ్లకు బదులుగా 30అడుగులు.. ఇలా నిబంధనలు పక్కనపెట్టి లేఅవుట్లు వేశారు. ఇలాంటి లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు జరగకుండా వైసీపీ ప్రభుత్వంలో ఆపేశారు. ఇక్కడ ప్లాట్లు కొన్న జనం నానా ఇబ్బందులు పడ్డారు. నిబంధనలపై అంత హంగామా చేసిన కార్పొరేషన్ పాలకవర్గం.. సొంత పార్టీ ఆఫీసును రాజప్రాసాదంలా కట్టుకోవడానికి మాత్రం అవేమీ పట్టించకపోవడం విశేషం. మేయర్ సురేశ్‌బాబే వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా ఉంటూ నిబంధనలకు తూట్లు పొడవడం చూసి ఇదే వైసీపీ మార్క్.. వీళ్లు అక్రమ కట్టడాల గురించి ఇంకేం మాట్లాడతారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలంటే ల్యాండ్ కన్వర్షన్ ఫీజు చెల్లించి చేయించుకోవాలి. అయితే ఇక్కడ వైసీపీ కార్యాలయానికి ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే నిర్మాణాలు చేపట్టారు. తొలుత ప్లాన్ కూడా లేదు. దీని నిర్మాణం చేపట్టినప్పుడు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఉండేది. కడప కార్పొరేషన్ పాలకవర్గం ఇప్పటికీ వైసీపీ చేతిలోనే ఉంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు మేయర్‌గా ఉన్నారు. అంత కీలకమైన పదవిలో ఉండి ఆయన సొంత పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని అనుమతులు లేకుండా చేపట్టడం చూసి ఔరా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. వైసీపీ కార్యాలయాన్ని అనుమతులు లేకుండా కడుతున్నారంటూ ఇటీవల ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. దీంతో విమర్శలు రావడంతో పార్టీకి చెడ్డపేరు వస్తుందని ఇప్పుడు ప్లాన్ అప్రూవల్ కోసం పెట్టారు. దీంతో అధికారులు తనిఖీలు చేపట్టడంతో వైసీపీ కార్యాలయ నిర్మాణంలో నిబంధనలు అన్నింటికి మంగళంపాడారని వెల్లడైంది. కార్పొరేషన్ అధికారులు మార్టిగేజ్ చేసి కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) లాగిన్‌కు పంపారు. అయితే ఆ పత్రాలను పరిశీలించగా భవనానికి ఫైర్ సర్టిఫికేట్, ఎన్‌ఓసీ, అడంగల్, ఈసీ, లేకపోవడంతో అధికారులు దాన్ని రిజెక్ట్ చేశారు. వాణిజ్య మాల్స్ ఇతర పెద్ద భవనాల నిర్మాణాలు చేపట్టేటపుడు ఫైర్ ఎన్‌ఓసీ తప్పనిసరి. అలాగే ఎవరిపేరుతో అయినా రిజిస్ట్రేషన్ అయిందా అని తీసుకోవాల్సిన అడంగల్ తీసుకోవాల్సి ఉంది. అయితే అలాంటివేమీ లేకుండానే కట్టేశారు. కేవలం ఖాళీ స్థలం పన్ను కట్టారు. మా గవర్నమెంటులో మాకేంటి అంటూ ముగించేశారు. ఆ నిర్మాణానికి సంబంధించిన నిబంధనలన్నీ దాచేశారు.

ప్రశాంత గ్రామాల్లో చిచ్చుపెట్టొద్దు

- ఎంపీ అవినాశ్‌ను హెచ్చరించిన బీటెక్ రవి

సింహాద్రిపురం, జూలై 20: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చు పెట్టవద్దని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి హెచ్చరించారు. శనివారం ఆయన సింహాద్రిపురంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజల్లో సానుభూతి కోసమే ఎంపీ ఓదార్పు యాత్ర చేస్తున్నారన్నారు. సింహాద్రిపురం మండలంలో ఎవరికి ఏ సమస్య లేకపోయినా ఇక్కడ ఓదార్పు యాత్ర పేరుతో రాజకీయం చేస్తున్నారన్నారు. ఎలాంటి సమస్యలు లేకపోయినా వచ్చి వినుకొండలో రషీద్ హత్యపై ఇక్కడ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హత్యా రాజకీయాల గురించి మాట్లాడే అర్హత ఎంపీ అవినాశ్‌రెడ్డికి లేదన్నారు. రషీద్ హత్యతో పార్టీలకు సంబంధం లేదన్నారు. అది వ్యక్తిగత కక్ష తప్ప రాజకీయ ప్రమేయం లేదన్నారు. ఇక్కడ మీ సొంత బాబాయ్ వివేకానందరెడ్డిని గొడ్డలితో నరికి చంపారని ఆ విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. దిద్దెకుంటలో పరమేశ్వర్‌రెడ్డి హత్య జరిగితే ఆ హత్యలో అధికారాన్ని ఉపయోగించి కొంతమందిని తప్పించారన్నారు. పీఏ రాఘవరెడ్డి సొంత గ్రామమైన అంబకపల్లెలో ఆయన ప్రోత్సాహంతో బీసీ నాయకుడైన నాగరాజును అతిదారుణంగా హత్య చేస్తే అడ్డు చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. త్వరలో వీటిపై విచారణ మొదలవుతుందని, విచారణలో నిజానిజాలు నిగ్గు తేలుతాయన్నారు. మీ రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి ఓదార్పు యాత్రలు చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్వంత జిల్లాకు రానున్న 52 మంది తహశీల్దార్లు

కడప(కలెక్టరేట్), జూలై 20: జిల్లాలోని పలు మండలాల్లో విధులు నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన 52 మంది తహశీల్దార్లు తిరిగి ఇక్కడకు రానున్నారు. ఈ మేరకు సీసీఎల్ఏ కమిషనర్ ఆయా జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. స్వంత జిల్లాకు వచ్చే తహశీల్దార్లందరికీ వారి స్వంత మండలాలకు కాకుండా ఇతర మండలాలకు నియమిస్తూ కలెక్టర్ నేడో, రేపో ఉత్తర్వులు జారీ చేయనున్నారు. కాగా మార్చి నెలలో ఎన్నికల ప్రక్రియ నోటిఫికేషన్‌కు ముందు తహశీల్దార్లు బదిలీపై వెళ్లారు. నాటి నుంచి నేటి వరకు జిల్లాలోని ప్రజలకు రెవెన్యూ సంబంధమైన భూ సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు తప్పలేదు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్నికల విధులకు వచ్చిన తహశీల్దార్లు రైతులకు మ్యుటేషన్లు చేసేందుకు కూడా సాహసించడం లేదు.

భూసేకరణ త్వరగా పూర్తిచేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్), జూలై 20: జాతీయ రహదారుల అభివృద్ధి పనుల్లో భాగంగా జిల్లాలో చేపడుతున్న భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్సెల్ హాల్లో జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, డీఎఫ్‌ఓ సందీప్ రెడ్డిలతో కలసి సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో భాగంగా రహదారులను విస్తరించి, రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా జిల్లా మీదుగా వెళుతున్న రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణం, వాటి అభివృద్ధికి భూసేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఫారెస్ట్, పర్యావరణం, కోర్టు సంబంధిత అభ్యంతరాలుంటే త్వరితగతిన క్లియర్ చేయాలని ఆదేశించారు. సంబంధిత అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలోని ఆయా ఆర్డీవోలు భూసేకరణ పెండింగ్ పనులను పునఃపరిశీలించి వచ్చే సమావేశాల్లో నివేదికలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు వెంకటపతి, శ్రీనివాసులు, చంద్రమోహన్, ఎస్డీసీ కౌసర్ భాను, ఎన్‌హెచ్ఏఐ పీడీ వేణుగోపాల్, జీఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్స్ సీఈ మల్లికార్జునరెడ్డి, ఎస్ఈ వెంకటరామయ్య, ఆర్ అండ్ బి ఎస్ఈ ప్రభాకర్ రెడ్డి, డీఈ మాధవి, నేషనల్ హైవేఈఈ విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్‌గా అదితిసింగ్



అదితిసింగ్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 20: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అదితిసింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు జేసీగా విధులు నిర్వహించిన గణేశ్‌కుమార్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా నియమితులయ్యారు.

కడప మున్సిపల్ కమిషనర్‌గా ఎన్.తేజ్‌భరత్



తేజ్‌భరత్

కడప మున్సిపల్ కమిషనర్‌గా ఎన్.తేజ్‌భరత్‌ను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవెలప్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఈయన కడప కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. కాగా కడప మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌ను సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఈయన 2022 మే 26న కడప కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన నేతృత్వంలో కడప నగరం అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిందని చెప్పవచ్చు. కడప నగరంలో అప్సర సర్కిల్ తప్ప అన్ని సర్కిళ్లను, రోడ్లను అభివృద్ధి చేశారు.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఫొటోల రగడ

- ఇంకా తొలగించని మాజీ సీఎం, మాజీ ఎమ్మెల్యేల ఫొటోలు
- కమిషనర్‌ను నిలదీసిన టీడీపీ కార్యకర్తలు



టీడీపీ కార్యకర్తల ఆందోళనతో చాంబర్‌లో ఫొటోలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రొద్దుటూరు, జూలై 20: ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిల ఫొటోలు తొలగించక పోవడంపై రగడ సాగింది. టీడీపీ ప్రభుత్వం వచ్చి 45 రోజులు గడిచినా మున్సిపాలిటీలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో పెట్టకపోవడంతో టీడీపీ మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు మున్సిపల్ కమిషనర్ రఘునాధరెడ్డిని నిలదీశారు. దీంతో వాటిని తొలగించాలంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ సీసీ రమేశ్‌ను కమిషనర్ ఆదేశించారు. టీడీపీ మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, కార్యకర్తలు చైర్‌పర్సన్ చాంబర్‌కు మున్సిపల్ సిబ్బందితో వెళ్లి దగ్గర ఉండి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఫొటోలను తీయించేవరకు ఆందోళన సాగించారు. అయితే.. తన అనుమతి లేకుండా తన చాంబర్‌లో ఫొటోలు ఎలా తొలగిస్తారంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం ఆమెతో పాటు వైఎస్ చైర్మన్లు బంగారురెడ్డి, ఖాజా, కౌన్సిలర్లు చైర్‌పర్సన్ చాంబర్‌లోకి కమిషనర్‌ను పిలించి గట్టిగా ప్రశ్నించారు. ఇందుకు కమిషనర్ రఘునాధరెడ్డి మాట్లాడుతూ.. 15 రోజుల క్రితమే చాంబర్‌లో మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ఫొటోలు తొలగించి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫొటో పెట్టాలని మీ దృష్టికి తెచ్చామన్నారు. ఫొటోలు తొలగిస్తే మళ్లీ మీరే పెట్టుకున్నారన్నారు. కడపలోని మేయర్ చాంబర్‌లో ఫొటోలు తొలగించలేదని అందువల్ల తాము తొలగించమని, సమస్య వచ్చినప్పుడు చూస్తామని చెప్పారన్నారు. అయినా తమ అనుమతి లేకుండా చాంబర్‌లోకి టీడీపీ కార్యకర్తలు రావడం సరికాదని చైర్‌పర్సన్ లక్ష్మీదేవి వాదించారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ.. ఉద్రిక్త పరిస్థితుల రీత్యా మీ దృష్టికి మళ్లీ తీసుకురాలేదని, అంతేకాకుండా ప్రభుత్వ ఉత్తర్వులు సైతం ఉన్నాయన్నారు. అనంతరం చైర్‌పర్సన్ చాంబర్‌లో సీటు వెనుక పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోను అక్కడి నుంచి తీసి టీవీ పక్కన పెట్టారు. ఈ ఫొటోల రగడతో మున్సిపల్ కార్యాలయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఒన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐలు హైమావతి, మంజునాధ కార్యాలయంలో ఎలాంటి ఘర్షణ జరగకుండా బయటి వ్యక్తులను మున్సిపాలిటీ కార్యాలయంలోకి రానివ్వకుండా చర్యలు తీసుకున్నారు.

గన్‌మెన్ తొలగింపు?

కడప (క్రైమ్), జూలై 20: వివిధ పార్టీలకు చెందిన మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలతో పాటు ఇతర నేతలకు గన్‌మెన్‌ను తొలగించినట్లు సమాచారం. దాదాపు జిల్లా వ్యాప్తంగా 40 మందికి 1ప్లస్ 1 గన్‌మెన్ ఉండగా వారిని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తొలగించారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులకు గన్‌మెన్‌లను తొలగించారు. ఆ ప్రభుత్వం వైసీపీ నేతలకు గన్‌మెన్ సౌకర్యం కల్పించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు గన్‌మెన్ అవసరం ఉన్న నేతలను గుర్తించినట్లు తెలుస్తుంది. ఈ మేరకు అవసరం లేని వారందరికి గన్‌మెన్‌ను తొలగించారని సమాచారం.

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుచేయాలి

- తులసిరెడ్డి



వేంపల్లె, జూలై 20: రాయలసీమలో హైకోర్టును గాని, కనీసం హైకోర్టు బెంచ్ గానీ ఏర్పాటుచేయాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శనివారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు రాయలసీమలో రాజధాని, కోస్తాలో హైకోర్టు ఏర్పాటు చేశారన్నారు. 1956లో తెలంగాణతో కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినపుడు రాజధాని, హైకోర్టు రెండు కూడా హైదరాబాద్‌కు వెళ్లాయన్నారు. 2014లో రాష్ట్ర విభజన కారణంగా నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటైందన్నారు. ఈ నేపథ్యంలో రాజధాని, హైకోర్టుల్లో ఒకటి రాయలసీమలో ఏర్పాటు కావాలన్నారు. అలా చేయకపోవడం చారిత్రక తప్పిదమన్నారు రాజధాని, హైకోర్టు ఒకేచోట ఉంటే పరిపాలన సౌలభ్యంగా ఉంటుందని వాదించడంలో ఔచిత్యం లేదన్నారు. దేశంలో 12 హైకోర్టులు రాజధాని వెలుపల ఉన్నాయన్నారు. కావున రాయలసీమలో హైకోర్టును గాని, హైకోర్టు బెంచిని గాని ఏర్పాటుచేసి జరిగిన చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దాలని కోరారు.

వైభోగం.. సౌమ్యనాథుడి కల్యాణం

నందలూరు, జూలై 20: సౌమ్యనాథుని కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి కల్యాణం చూచువారికి చూడముచ్చటగా జరిగింది. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో కల్యాణవేదికను అలంకరించారు. ఆలయ అర్చకులు సునీల్‌కుమార్‌శర్మ బృందంచే సౌమ్యనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకకు ఉత్సవ మూర్తులను ముస్తాబు చేసి మేళ తాళాల మధ్య కల్యాణ వేదికపైన ఆశీనులు చేశారు. పండితుల మంత్రోచ్చారణలు, పసుపులేటి శివశంకర్ వ్యాఖ్యానంతో భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయం భక్తిపారవశ్యంతో నిండిపోయింది. ఉదయం అభిజిత్ లగ్నంలో పాంచరాత్ర ఆగమ ప్రకారం వేదపండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మాంగళ్యధారణ, ముత్యాల తలంబ్రాల క్రతువులను నిర్వహించారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాజంపేట టీడీపీ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం, మేడా విజయశేఖర్‌రెడ్డి, టీటీడీ డిప్యూటీ ఈవో నటేషబాబు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. వీరందరినీ పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్యాణమహోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి మాడ వీధుల్లో విహరించారు. భక్తులు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి గజ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. కార్యక్రమంలో టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణమహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ చైతన్య, మన్నూరు సీఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట స్వామ్రాజ్ ఆధ్వర్యంలో స్కౌట్ సభ్యులు భక్తులకు సేవలందించారు.

కల్యాణానికి హాజరైన ప్రముఖులు

కల్యాణ మహోత్సవానికి ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, రాజంపేట ఆర్డీవో మోహన్‌రావు, డీఎస్పీ చైతన్య, ప్రముఖ నటుడు, దర్శకుడు తోట వేణుగోపాల్, జనసేన పార్టీ నాయకులు అతికారి దినేష్, గీతాంజలి విద్యాసంస్థల అధినేత రమణ, రాజంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యెద్దల విజయసార్, టీడీపీ నాయకులు పల్లె సుబ్రమణ్యం, గంటా వాసుదేవయ్య, జంగంశెట్టి సుబ్బయ్య, చక్రాల రామసుబ్బన్నలు హాజరయ్యారు. వీరిని ఆలయ మర్యాదలతో సత్కరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం వైభవంగా రథోత్సవం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రథంపై శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు.



సౌమ్యనాథస్వామి కళ్యాణోత్సవానికి హాజరైన భక్తులు



మాంగల్యాన్ని చూపుతున్న పండితులు

శ్రావణ మాసోత్సవాలు విజయవంతం చేద్దాం



ఉత్సవ సమన్వయ కమిటీ సమావేశ దృశ్యం

చక్రాయపేట, జూలై 20: అన్ని శాఖల అధికారుల సహకారంతో గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగే శ్రావణ మాసోత్సవాలను విజయవంతం చేద్దామని గండి దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. శనివారం శ్రావణమాసోత్సవాలపై అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆగస్టు 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రావణ మాసోత్సవాలకు అన్ని శాఖల సహకారం కావాలని కోరారు. రెవెన్యూశాఖ సహకారం, రోడ్డు భవనాలు, రవాణా, విద్యుత్, ఆరోగ్య, పోలీసు, పంచాయతీ, ఎక్సైజ్, సమాచారశాఖ, బ్యాంకు వారు చేయాల్సిన పనులను వివరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో పందిళ్లు, క్యూలైన్లు, ట్యాంకర్లు ఏర్పాటు, సింటెక్స్ ట్యాంకులు, విద్యుద్దీపాలంకరణ, కటౌట్లులాంటివి ఉంటాయన్నారు. గండిలో నూతన ఆలయ నిర్మాణం జరుగుతున్నందున, గుడి ముందు రాజగోపురం పునాదులు వేసి ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని, రోడ్డు వెడల్పు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను కోరారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. బ్యాంకు అధికారులు టికెట్లు, లడ్డు కౌంటర్లలో ఉండి కలెక్షన్ చేయాలన్నారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, కన్వీనర్ మునిరెడ్డి, ప్రధాన అర్చకులు కేసరి, ఉప అర్చకులు రాజారమేష్ డాక్టర్ వాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సాలన్న, ఆర్టీసీ డీఎం ఆర్ఎంఎస్‌రెడ్డి, గురుమోహన్‌రెడ్డి, ఎస్ఐ రంగారావు, ప్రవీణ్ కుమార్ యాదవ్, కొండారెడ్డి, శ్రీనివాసులు, ఆలయ మాజీ ఛైర్మన్లు వెంకటస్వామి, భాస్కరుడు, పీపీ రాయుడు పాల్గొన్నారు.

అన్నమయ్య డ్యాం, ఒంటిమిట్ట చెరువుకు నీరివ్వాలి



భారీ నీటిపారుదలశాఖ మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించిన టీడీపీ నేతలు

ఒంటిమిట్ట, జూలై 20: అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణం, ఒంటిమిట్ట చెరువుకు పైపు లైను ద్వారా నీళ్లు అందించాలంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ శనివారం భారీ నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య డ్యాం తెగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, త్వరగా అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు సుమారు రూ.38 కోట్లతో పైపులైను వేసి ఒంటిమిట్ట చెరువుకు నీరు అందించారన్నారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ బకాయిలు చెల్లించకుండా ఒంటిమిట్ట చెరువు ఎండిపోయేలా చేసిందన్నారు. స్థానికుల కష్టాలు తొలగిపోవాలంటే ఒంటిమిట్ట చెరువుకు నీరందించాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నేతలు కట్టా నారాయణ, తుమ్మలకుంట్ల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వం మారింది.. గుర్తించండి

పనితీరు మార్చుకోక పోతే చర్యలు తప్పవు : ఎమ్మెల్యే



ప్రభుత్వ ఆస్పత్రిలో వైసీపీ పోస్టర్ పెయింట్

మైదుకూరు రూరల్ జూలై 20: వైసీపీ ప్రభుత్వం మారి టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఈ విషయాన్ని గుర్తించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అధికారులకు సూచించారు. శనివారం ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించారు. గోడలపై వైసీపీ నేతల బొమ్మల పెయింటింగ్‌లను చూశారు. ప్రభుత్వం మారినా పాత ప్రభుత్వం ఉందనే భ్రమలోనే ఉన్నట్లు ఉన్నారంటూ వారికి చురకలేశారు. రోగులకు వైద్యం సరిగా అందించక పోయినా, సమయానికి ఆఫీసుకు రాకపోయినా, ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు,

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

ప్రతి కార్యాలయంలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలి

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

పులివెందుల రూరల్, జూలై 20: లైంగిక వేధింపుల ఫిర్యాదులపై తక్షణం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక మినీ సెక్రటేరియట్‌లోని ఆర్డీఓ కార్యాలయ సమావేశం హాల్‌లో పోష్ యాక్ట్-2013 చట్టంపై డివిజన్ పరిధిలోని మండలస్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడుతూ పోష్ యాక్ట్-2013ను పటిష్టంగా అమలు చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. వేధింపులకు గురైన మహిళలు మున్సిపల్‌స్థాయిలో మున్సిపల్ కమిషనర్, మండలస్థాయిలో తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. నేరుగా ఫిర్యాదు చేయలేని వారి కోసం ప్రతి కార్యాలయంలో కంప్లైంట్ బాక్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమష్టిగా ముందుకెళ్లి మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేద్దామని ఆమె పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఐ సునీల్‌కుమార్, ఎంపీడీఓ దివాకర్, సీడీపీఓలు శ్రీలత, సునీత, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, వ్యవసాయ శాఖ, పీఆర్, ఐసీడీఎస్ పీడీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో ఇద్దరు యువకులు ఆత్మహత్య

పుల్లంపేట, జూలై 20: మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకులు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పుల్లంపేట ఎస్ఐ రఘురాం తెలిపారు. దళవాయిపల్లె వాసి వీరాంజనేయరెడ్డి, రామక్కపల్లెకు చెందిన జయసింహ ఆత్మహత్య చేసుకున్నారు. వీరాంజనేయరెడ్డి పదేళ్ల కిందట కువైత్‌కు వెళ్లాడని, అక్కడ అకామా లేక చాలా ఇబ్బందులు పడ్డారని, ఇంటికి కూడా డబ్బు పంపలేకపోయాడు. నెల కిందట కువైత్ ప్రభుత్వం కానూన్ పెట్టడంతో ఇండియాకు వచ్చిన వీరాంజనేయరెడ్డి స్వగ్రామంలో ఇంటికి రాకుండా తన స్నేహితుని వద్దే ఉంటూ వచ్చాడన్నారు. మనస్థాపంతో శనివారం అనంతంపల్లె సమీప కోటగడ్డ ఆంజనేయస్వామి ఆలయం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఉండడంతో స్థానికులు గమనించి ఫిర్యాదు చేశారన్నారు. జయసింహ ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుడిపై దాడి

ఐదుగురిపై కేసు నమోదు - ఇందులో ఎంఈఓ ఒకరు

కడప (క్రైం), జూలై 20: కడప నగరం డీఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును పాత ఆర్జేడీ అనుచర ఉపాధ్యాయులు దాడి చేసిగాయపరచినట్లు చిన్నచౌక్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు వేంపల్లికు చెందిన వెంకటేశ్వర్లు సుండుపల్లె మండలం జి.కె రాజుపల్లెలోని జడ్పీ స్కూల్‌లో సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 18న పూర్వ ఆర్జేడీపై విచారణ కోసం కడప డీఈఓ కార్యాలయానికి వచ్చారు. అదే సమయంలో ఆర్జేడీ అనుచరులు ఉపాధ్యాయులు గడ్డం ఆదినారాయణరెడ్డి సహా సుండుపల్లె ఎంఈఓ వెంకటేశ్‌నాయక్, మరో ఇద్దరు ఉపాధ్యాయులు నాగమునిరెడ్డి, శివకుమార్‌రెడ్డి, రామకృష్ణ బాధితుడి సెల్‌ఫోన్‌ను పగులగొట్టి దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఆర్జేడీపై విచారణకు ఆటంకం కలిగించడం కోసం దాడి జరిగినట్లు బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం - ఒకరి అరెస్ట్

వీరబల్లి, జూలై20: అన్నమయ్య జిల్లా సానిపాయి అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనల మేరకు ఆర్ఐ (ఆపరేషన్స్) సురేశ్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ టీం అటవీ సిబ్బందితో కలిసి సానిపాయి బేస్ క్యాంప్ నుంచి రాయవరం మీదుగా ఆవులదారి, సరస్వతి కటువ, ముడుంపాడు అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ చేస్తూ వెళ్లారు. లమోర నిషేధిత అటవీ ప్రాంతంలో కొందరు ఎర్రచందనం దుంగలతో కనిపించారు. వారిని చుట్టు ముట్టగా వారు దుంగలను పడేసి పారిపోసాగారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఒకరిని పట్టుకున్నారు. ఇతడు తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా అత్తిపట్టు, వీరప్పనూరు పంచాయతీ వాసి రమేశ్‌గా గుర్తించి అరెస్టు చేసి ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.


భూ కబ్జాలు కట్టడయ్యేనా...?

కోట్లు విలువైన భూముల ఆక్రమణలు ● ఆక్రమిద్దాం... అమ్మేద్దాం... ● పేదలకు పట్టాలు ఇప్పించి కాజేసే యత్నం

పట్టించుకోని రెవెన్యూ అధికారులు ● ఖాళీస్థలం కన్పిస్తే కబ్జాలు ● మళ్లీ మొదలైన కబ్జాల పర్వం



సి.కొత్తపల్లె పొలంలో ప్రభుత్వభూమి లేఔట్



సి.కొత్తపల్లె పొలంలో కబ్జాచేసి, కంచెవేసిన ప్రభుత్వభూమి

బద్వేలుటౌన్, జూలై 20: బద్వేలు పేరు చెబితే కాలజ్ఞానతత్వవేత్త వీరబ్రహ్మేంద్రస్వాముల వారు గుర్తుకువచ్చేవారు. ప్రస్తుతం బద్వేలు అంటే ఠక్కున గుర్తుచ్చేది భూకబ్జాల అడ్డాగా పేరుగాంచింది. ఇక్కడ సెంటు భూమి కన్పిస్తేచాలు ఆక్రమింస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో కబ్జా దారులు రాత్రికి రాత్రే భూమిని ఆక్రమించి సొమ్ముచేసుకుంటారని జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఆక్రమిద్దాం, అమ్మేద్దాం.. అన్నట్లు కొందరు, కబ్జాచేస్తే మనలను ఎవరు ఆపేదంటూ మరికొందరు కబ్జాల మీద కబ్జా చేస్తున్నా, రెవెన్యూ యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

మళ్లీ మొదలైన కబ్జాల పర్వం

చెరువైనా... కుంటైనా...గుట్టైనా... కొండైనా అది సర్కారు భూమి అయితే చాలు వారి కళ్లపడితే కబ్జాకావాల్సిందే. రెవెవిన్యూ అధికారులు మాత్రం, కోట్లరూపాయల ప్రభుత్వభూములు కబ్జా అవుతున్నా నామమాత్రంగా పరిశీలించి బోర్డులు నాటినా, అధికారులు నాటిన బోర్డులు తొలగించడం కంచెవేస్తున్నా రెవెన్యూ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పడ్డాక ఇక్కడ స్థలాలకు మరింత విలువపెరిగింది. దీంతో కబ్జాదారులు ప్రభుత్వ స్థలాలపై కన్నేశారు. గోపవరం తహసీల్దార్ కార్యా లయం పక్కనే కొండగుట్టపై 1623, 1624 సర్వే నెంబర్‌లో గుడిసెలు వేసినా అధికారులు పట్టించుకోలేదు. బద్వేలు మండలం సి.కొత్తపల్లె గ్రామ పొలం సర్వే నెంబర్ 57/2,3,4లో 3.14ఎకరాలు, సర్వేనెంబర్ 51/1, 2, 3, 4, 5లో 3.78 ఎకరాలు, అబుసాహెబ్‌పేట సమీపంలోని 6/1లో 1.20ఎకరాలు, 5.సర్వే నెంబర్ 957, సిద్దమ్మపేరంటాల ప్రాంతంలో కొందరు భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నారు. సి.కొత్తపల్లె పొలం సమీపంలో కాల్వకు ఆనుకుని మరికొందరు గుడిసెలువేసి భూములను కబ్జాచేస్తున్నారు. పోరుమామిళ్ల, బద్వేలు బైపాస్‌రోడ్డులో కొందరు కబ్జాలుచేసి లక్షల రూపాయలు చేతులు మారుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకున్న పాపాన పోలేదు. ముందు నిరుపేదలను పెట్టి, వెనుక కబ్జాదారులు ఉంచి, గుడిసెలు వేయించి, పేదలకు ఇంటిస్థలాలు ఇప్పిస్తామని ఆశలు చూపించి వారి నుంచి వేలకు వేలరూపాయలు వసూలు చేసేవారు కొందరు. కొండలు, గుట్టలు, చెరువుల్లో గుడిసెలు వేస్తున్నా, ప్రభుత్వ స్థలాలు పేదలకు రావని తెలిసీ, కబ్జాదారుల మాటలు నమ్మి, వారి వెనుక నడుస్తూ, డబ్బు ఖర్చుచేసుకుంటూ సమయం వృధాచేసుకునే పేదలనే కబ్జాదారులుగా చూపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులుకానీ, సిబ్బందికానీ పట్టించుకోకపోవడం దయనీయం. బద్వేలులో కబ్జాదారులు సరికొత్త ఎత్తుగడతో ప్రభుత్వ భూములను కాజేయడానికి పన్నాగంపన్ని, ముందుగా పేదల పేరిట పట్టాలు ఇప్పించి, ఆపై వాటిని స్వాధీనం పరుచుకుంటూ పేదలను తప్పుదోవ పట్టిస్తూ, కబ్జాదారులు కుతంత్రం పన్నుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని కబ్జాచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



బద్వేలు మండల పరిధి సి.కొత్తపల్లె పొలంలో కబ్జాలకు పాల్పడితే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అర్హులైన పేదలకు అన్యాయం జరగనీయం, ఆక్రమణలకు అడ్డుకట్టవేసేందుకు చర్యలు చేపడతాం. ప్రభుత్వ భూముల్లో బోర్డులు ఏర్పాటు చేసినా బోర్డులు తీసేసి కబ్జాలకు గురిచేసే ఎంతటివారిపైనైనా కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలగిస్తే చట్టపర చర్యలు తీసుకుంటాం.

మధుసూదన్‌రావు, తహసీల్దారు, బద్వేలు



గోపవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద కబ్జాదారులు వేసిన గుడిసెలు - సి.కొత్తపల్లె ప్రభుత్వ పొలంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డు - బోర్డు తీసేసి కంచెనాటిన కబ్జా దారులు

పశువుల సంతను ప్రారంభించిన ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్ జూలై 20: స్థానిక నంద్యాల రోడ్డులో పశువుల సంతను శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రారంభించారు. గత ప్రభుత్వంలో కొందరి స్వలాభం కోసం మైదుకూరులోని పశువుల సంతను గగ్గితిప్ప వద్ద ఏర్పాటు చేయడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. దీనిపై స్పందించిన పుట్టా సంతను మైదుకూరులోనే ఏర్పాటు చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఆమేరకు మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌లో సభ్యుల ఆమోదంతో మైదుకూరులోకే సంతను మార్చి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, లక్ష్మీనారాయణ, రాధ, రాయుడు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

రాజంపేట, జూలై 20: రాజంపేట మండల పరిధి పోలి గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ సుబ్బయ్య(26) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పోలి ఎస్టీకాలనీ వాసి సుబ్బయ్య అదే గ్రామంలోని పెంచలయ్య ట్రాక్టర్ యజ మాని వద్ద ఇంటి పునాదిరాళ్లను గుట్టపై నుంచి తోలడం జవనోపాధిగా జీవించేవాడు. అదే క్రమంలో రాళ్లను తీసుకు వస్తూ ట్రాక్టర్ సమస్యపై కింద ఉండి పనిచే స్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి సుబ్బయ్య శరీరం పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

వైభవంగా స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట, జూలై 20: ఏకశిలా నగరి కోదండరాముని స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువజామున సుగంధద్రవ్యాలు, పట్టువస్త్రాలతో ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. సీతారామ లక్ష్మణ మూలవిరాట్టులకు గంధం, చందనం, పాలు, పెరుగుతో అభిషేకించారు. అనంతరం స్వామివారిని అలంకరించారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

స్థలం కోసం ఇరువర్గాలు ఘర్షణ

ఒంటిమిట్ట, జూలై 20: కోదండరామాలయ కాలనీలో ఖాళీ స్థలం కోసం రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కొద్దిరోజుల కిందట ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవాలని ప్రయత్నించడం, అప్పటి నుంచి ఇరువర్గాల నడుమ వివాదం కొనసాగుతోంది. శనివారం మధ్యాహ్నం ఓ హోటల్ వద్ద ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకుని దాడి చేసుకున్నారు. పోలీసులు రెంటాల రాజేష్, విశ్వనాథ్‌ను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కడప క్రైమ్, జూలై 20: కడప నగరం జ్యోతి కెమికల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంహెచ్ లక్ష్మీ (28) మృతి చెందినట్లు రిమ్స్ సీఐ రామచంద్ర తెలిపారు. అక్కాయపల్లెలోకి తోటపల్లె రోడ్డుకు చెందిన డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్‌లో ఆమె బ్యుటీషియన్ కోర్సు చేస్తోంది. శనివారం భర్త నవీన్‌తో కలసి ద్విచక్ర వాహనంలో డీఆర్‌డీఏకి వెళుతుండగా గ్యాస్ సిలిండర్‌ల లారీ బైక్‌ను ఢీకొనడంతో భార్య భర్తలు కింద పడ్డారు. భార్య వెనక టైర్ కింద పడి తీవ్ర గాయాలపాలై మృతి చెందినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ వాడకం నిలిపేయాలి : కమిషనర్



మున్సిపల్ అధికారుల దాడుల్లో స్వాధీనం చేసుకున్న 300 కిలోల ప్లాస్టిక్ కవర్లు

రాయచోటిటౌన్, జూలై20: దుకాణ యజమానులు, తోపుడు బండ్ల వారు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు హెచ్చరించారు. శనివారం ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు దుకాణాలపై దాడులు చేసి అక్రమంగా వినియోగిస్తున్న 300 కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యంలో భాగంగా 2022లోనే కేంద్ర ప్రభుత్వం 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై పూర్తి నిషేధం విధించినట్లు తెలిపారు. గతంలోనే పలుమార్లు ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించినా మార్పు రావడం లేదన్నారు. ఇకపై ప్లాస్టిక్ వాడకం వందశాతం ఆగే వరకూ రోజూ తనిఖీ చేస్తామని, దుకాణదారులు అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగించే 120 మైక్రాన్ కన్నా తక్కువ పరిమాణం గల ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు అమ్మడం, కొనడం వాడకం పూర్తిగా నిషేధమన్నారు. పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు సహకరించాలని పిలుపు నిచ్చారు. సీజ్ చేసిన ప్లాస్టిక్ కవర్లను మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, పోలీసు సిబ్బంది, శానిటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఎస్ఐ



కడప (క్రైం), జూలై 20: కడప నగరం రాజీవ్ మార్గ్ వద్ద స్కూటర్‌పై వస్తున్న ఇంటర్ విద్యార్థి వాహనం ఆపి ఎస్ఐ మధుసూద నరెడ్డి చితక బాదినట్లు విద్యార్థి తండ్రి, మాజీ ప్రభుత్వ ప్లీడర్ గుర్రప్ప ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమా రుడు స్కూటర్‌పై వెళితే ఎస్ఐ ఆపి జరిమానా గానీ, లేకుంటే తమకైనా ఫిర్యాదు చేసి చెప్పాలేగానీ ఇలా పిల్లలపై దాడి చేస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఎస్ఐ తీరుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎస్ఐ చేతిలో గాయపడిన విద్యార్థి రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఎస్ఐ మధు సూదనరెడ్డిని వివరణ కోరగా తనిఖీలో భాగంగా వాహనంలో వేగంగా వెళ్లడాన్ని గమనించి అడ్డుకునేందుకు తన చేతిని అడ్డంపెట్టగా వేగంగా పోతున్న బైక్ తగలడంతో చేయి విరిగిందన్నారు. దీంతో అతన్ని పట్టుకుని, వాహనాన్ని తీసుకుని మందలించినట్లు తెలిపారు.

ప్రహరీ విషయంపై ఘర్షణ - మహిళలకు గాయాలు



దాడిలో గాయపడిన నక్కా లక్ష్మీదేవి, లక్ష్మీదేవమ్మ

రామాపురం, జూలై20: ఓ ఇంటి ప్రహరీ విషయమై జరుగుతున్న ఘర్షణను చూసేందుకు వచ్చిన ఇద్దరు మహిళలపై దాడి జరిగి గాయపడినట్లు ఎస్ఐ ఎల్‌వీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే....

హసనాపురం పంచాయతీ కొండాండ్లపల్లె వాసులు సిగ రాజారావు, జరుగు చలమారెడ్డి ఇంటి ప్రహరీ విషయంపై శనివారం ఘర్షణ పడుతున్నారు. రామాపురం మండలం హసనాపురం పంచాయతీ కొండావాండ్లపల్లి వాసులు సిగా రాజారావు, జరుగు చలమారెడ్డి కొద్ది కాలంగా ఇంటి ప్రహరీ విషయంపై ఘర్షణ పడుతూ ఉండేవారు. శనివారం జిల్లా సర్వేయర్‌ను గ్రామంలోకి పిలిపించి ఇంటి ప్రహరీ సర్వే చేస్తుండగా వారి ఇద్దరూ ఘర్షణ పడుతుండగా చూడడానికి వచ్చిన నక్క లక్ష్మీదేవి, నాగిరెడ్డి, లక్ష్మీదేవమ్మపై జరుగు చలమారెడ్డి మరికొందరు వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన నక్క లక్ష్మీదేవి ముఖంపై రక్తగాయాలు నాగిరెడ్డి లక్ష్మీదేవమ్మకు రెండు చేతులు విరిగి రక్త గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలానికి రామాపురం ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది చేరుకుని గాయపడిన మహిళలను చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హెల్మెట్.. మనకూ మన కుటుంబానికి శ్రీరామరక్ష

● ప్రతి ఒక్కరూ తప్పక ధరించాలి ● నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి దీనబాబు


ర్యాలీని ప్రారంభిస్తున్న నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి దీనబాబు, జడ్జీలు

కడప(రూరల్), జూలై 20: మనకూ.. మన కుటుంబానికి హెల్మెట్ శ్రీరామరక్ష అని, కావున ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించాలని కడప నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి దీనబాబు పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయ సేవాసదన్‌లో హెల్మెట్ వినియోగంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి దీనబాబు మాట్లాడుతూ మనల్ని, మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు, పిలియన్ డ్రైవర్ వినియోగదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి తద్వారా ప్రమాదాలను నివారించాలన్నారు. వాహనదారులు హెల్మెట్ వాడి నలుగురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఐఎస్‌ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలన్నారు. రోడ్డు భద్రత నియమావళిని పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడంపై అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. సెక్షన్ 129/184 మోటార్ వెహికల్ యాక్సిడెంట్ చట్టం, సెక్షన్ 304, 183, 184, రూల్ 176 ప్రకారం రోడ్డు భద్రతకు సంబంధదించి ఎలక్ట్రానిక్ పరికరాలపైన స్పీడ్ కెమెరా, క్లోజ్ సర్క్యూట్ టెలివిజన్ కెమెరా, స్పీడ్ గన్ తదితర టెక్నాలజీ పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతకు వాడుతోందన్నారు. ద్విచక్ర వాహనదారులు, పిలియన్ డ్రైవర్లు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరమన్నారు.

ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ వారి సహకారంతో గిరిజనులకు, కార్మికులకు, ట్రాన్స్‌జెండర్లకు, పేద ప్రజలకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. అనంతరం కోర్టు ఆవరణం నుంచి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ద్విచక్ర వాహనాలు, పిలియన్ డ్రైవర్ల వినియోగదారులు, రక్షిత తలపాగా(హెల్మెట్), ఉపయోగించడంపై హైకోర్టు డబ్ల్యూపీ పిల్ నంబర్ 116/2024లో ఆదేశాలు జారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ ఎఫ్ఏసీ సెక్రటరీ, అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు, పారాలీగల్ వలంటీర్లు, ప్యానల్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఎన్జీఓలు, ప్రజలు పాల్గొన్నారు.

గండి అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలి


గండిలో చేయాల్సిన పనులను గురించి తెలుసుకుంటున్న వేంపల్లె టీడీపీ పరిశీలకుడు రఘునాథరెడ్డి

చక్రాయపేట,జూలై 20: రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని వేంపల్లె టీడీపీ పరిశీలకుడు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం రఘునాథరెడ్డి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన, ఉపప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్ ఆయనకు స్వాగతంపలికి పూజలు చేయించారు. ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారుచేయాలని ఏసీకి, అర్చకులకు తెలిపారు. ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలని కోరారు. రాయచోటి-వేంపల్లె రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉందని, ఆరోడ్డు పూర్తయితే ఆలయానికి భక్తులు విరివిగా వస్తారన్నారు. శ్రావణమాసోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చే యాలని ఆయన కోరారు.

గండి ఆలయానికి టీవీ వితరణ

చక్రాయపేట, జూలై 20: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రం వీరాంజనేయ స్వామి ఆలయానికి టీవీ వితరణ చేశారు. శనివారం వేంపల్లెకు చెందిన బీజీఎస్ ఎలక్ట్రానిక్స్ అధినేత కే.శే.భైరిశెట్టి వెంకటజయకుమార్ ధర్మపత్ని కే.శే.భైరిశెట్టి జ్యోతికుమారి జ్ఞాపకార్థం వారి కుమారులు బాలగంగాధర్, వెంకటసునీల్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి రూ.40వేలు విలేవైన టీవీని బహూకరించారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారికి ప్రధాన, ఉప ప్రదాన అర్చకులు కేసరి, రాజారమేష్ ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

'హత్యా రాజకీయాలు వైసీపీకే చెల్లు'


విలేకరులతో మాట్లాడుతున్న షబ్బీర్

వేంపల్లె, జూలై 20: హత్యా రాజకీయాలు వైసీపీకే చెల్లుతాయని ఆ పార్టీ ప్రభుత్వంలో ఎన్నో అరాచకాలు, హత్యలు జరగడమే నిదర్శనమని టీడీపీ మైనార్టీ సెల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ తెలిపారు. వేంపల్లెలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైందని, మంత్రిత్వ శాఖల్లో మంత్రులు కొలువుతీరుతున్నారని, అప్పుడే ప్రభుత్వంపై వైసీపీనాయకులు విమర్శలు చేయడం శోచనీయమన్నారు. హత్యలు చే యడం వైసీపీ నాయకులకే చెల్లునని, ఎక్కడ జరిగిన టీడీపీపై బురదజల్లడం ఆ పార్టీ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు.పులివెందుల నియోజకవర్గంలోనే వైసీపీ నాయకులు హత్యలు చేయించారని, చివరకు వైఎస్ వివేకా హత్య సొంత మనుషులే చేసిన విషయం గుర్తులేదా అంటూ ప్రశ్నించారు. ప్రజలను అయోమ యం పరచకుండా అభివృద్ధికి సహకరించాలని హితవుచెప్పారు. విలేకరుల సమావేశంలో టీడీపీనాయకులు గోటూరు నాగభూషణం, ఫయాజ్, షేక్ ఇలియాజ్, మహబూబ్ షరీఫ్, కరిముల్లా, చెంద్రాయుడు, పీరా, నారాయణ, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: బీటెక్ రవి

చక్రాయపేట, జూలై 20: చక్రాయపేట మండలాన్ని అ న్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. శనివారం పులివెందులలోని పార్టీ కార్యాలయంలోఉన్న బీటెక్ రవిని మండల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా చక్రాయపేటలోని వెంకటేశ్వర, వీరభద్రస్వామి ఆలయం ముందు మురుగునీరు వస్తోందని ఆలయ చైర్మన్ లాయర్ రామాంజనేయరెడ్డి తెలిపారు. దీని వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని బీటెక్ రవిక తెలియజేయగా కడప దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌కు ఫోన్ ద్వారా సమస్యను వివరించారు. పరిష్కరించాలని సూచించారు. అలాగే కాలేటి వాగు ప్రాజెక్టుకు నీరు తెప్పించి అక్కడి నుంచి మండలంలోని నలుమూలల చెరువులకు నింపేందుకు దా దా పు రూ.600 కోట్లు నిధులు కావాల్సి వస్తుందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని బీటెక్ రవి తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ బాలస్వామిరెడ్డి, ఆలయం మాజీ చైర్మన్ ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు డిపార్టుమెంట్ పరీక్షలపై అవగాహన సదస్సు


కడప ఎడ్యుకేషన్ జూలై 20: కడప ఎన్‌జీఓ భవన్‌లో ఆదివారం ఉదయం పది గంటలకు డిపార్టుమెంట్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ అమరావతి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదదర్శులు ఈశ్వర్‌చంద్ర, ఆలిఖాన్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు.

'జగన్‌ను జనం నమ్మే పరిస్థితిలో లేరు'

కడప ఎడ్యుకేషన్, జూలై 20: దేశంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని జనం నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరని డిప్యూటీ మాజీ మేయర్ ఆరీఫుల్లా పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఘోరంగా ఓడిపోయిన షాక్‌లో జగన్‌రెడ్డికి మతిభ్రమించిందన్నారు. రాష్ట్రపతి పాలన పెట్టాలని అనుకోవడం దుర్మార్గమన్నారు. వారి పార్టీ నాయకుల మధ్యనే కొట్లాటలు జరిగి హత్యలు చేసుకుంటే దాన్ని కూటమి ప్రభుత్వంపైకి నెట్టడం ఎంత వరకు న్యాయమన్నారు. ఇటువంటి తప్పుడు ఆరోపణలు చేయకుండా ప్రజా సంక్షేమం కోసం తగు సూచనలు ఇవ్వాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్


మాట్లాడుతున్న డాక్టర్ సతీష్

చెన్నూరు, జూలై 20: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవ హరించాలని, ప్రధానంగా వర్షంలో తడవడం దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సతీష్ సూచించారు. చెన్నూరు సీహెచ్‌సీలో శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు పలుచోట్ల దోమలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అవి కుట్టడంతో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. సీహెచ్‌సీలో నిరంతరాయంగా వైద్యసేవలు అందిస్తామన్నారు.

నూతన కమిటీ నియామకానికి నోటిఫికేషన్

సీకేదిన్నె, జూలై 20: చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మ గుడి నూతన ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఈఓ సురేష్ కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి ఆదేశాల మేరకు 20 రోజుల లోపు కడప దేవదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

ఎమ్మెల్యే చొరవతో తీరిన నీటి కష్టాలు

కమలాపురం రూరల్, జూలై 20: ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి చొరవతో సి.గోపులాపురం గ్రామానికి నీటి కష్టాలు తొలిగాయి. మీడియా ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

రక్తదానం చేసేందుకు ముందుకురావాలి

కడప (మారుతీనగర్),జూలై 20: రక్తదానం చేసేందుకు యువత ముందుకురావాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ సూచించారు. నెహ్రూ యువ కేంద్రం, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో శనివారం స్థానిక బాలాజీనగర్‌లోని నెహ్రూ యువకేంద్రం యూత్ హాస్టల్‌లో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

వీరపునాయునిపల్లె, జూలై 20: మండలంలోని ఎన్.పాలగిరి క్రాస్ వద్ద ఉన్న శ్రీఅవధూత కాశిరెడ్డినాయన, శ్రీషిరిడీసాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలునిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు పుల్లారెడ్డి, లక్ష్మిరెడ్డిలు తెలిపారు. ఆదివారం ఉదయం ప్రత్యేకపూజలు జరిపించనున్నట్లు చెప్పారు. భజన కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నదానానికి ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామస్థులు రూ.20వేలు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు.

ఆశాల ధర్నాను జయప్రదం చేయండి

కడప (మారుతీనగర్), జూలై 20: ఆశా వర్కర్ల ధర్నాను జయప్రదం చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ కలెక్టరేట్ ఎదుట ధర్నా ఉంటుందన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 20: వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పి.చంద్రశేఖర్, సుబ్బరాయుడు, మునయ్య పాల్గొన్నారు.

వృషభాచలేశ్వర ఆలయ చైర్మన్‌గా రమణ



వేంపల్లె, జూలై 20: వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్‌గా టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి పివి రమణను ఖరారు చేసినట్లు తెలిసింది. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, మండల పరిశీలకులు రఘునాథరెడ్డిని చైర్మన్ పదవి కావాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీకి చెదిన కురాకుల వెంకటేష్ చైర్మన్‌గా ఉండగా పదవీ కాలం పూర్తయింది. ఈలోగా టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. గతంలో దేవస్థాన సభ్యులుగా పనిచేసిన అనుభవం ఉన్న రమణకే అధిష్టానం మొగ్గుచూపినట్లు తెలిసింది. చైర్మన్ అభ్యర్థిఖరారుకావడంతో ఇక నోటిఫకేషన్ విడుదల అయిన వెంటనే పాలక మండలి ఏర్పాటవుతుందని టీడీపీవర్గాలు తెలిపాయి.

తల్లికి వందనం కోసం ఆన్‌లైన్ తప్పనిసరి

కడప (ఎడ్యుకేషన్), జూలై 20: విద్యార్థులకు తల్లికి వందనం పథకం కావాలంటే ఆ విద్యార్థి పేరు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు అయి ఉండాలని కడప ఎంఈఓ గంగిరెడ్డి శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాలకు సంబంధించి విద్యార్థుల నమోదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు అయితేనే తప్ప విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందవన్నారు. సంబంధిత పాఠశాలల్లో తమ పిల్లల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు అయ్యిందో లేదో చూసుకోవాలన్నారు.

ఎక్కువ రోజులు నీటి నిల్వలు ఉంటే ప్రమాదం

పులివెందుల టౌన్, జూలై 20: ఇళ్లలోను, ఇంటి పరిసరాల్లోను ఎక్కువ రోజులు నీటి నిల్వలు ఉంటే ప్రమాదమేనని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. శనివారం స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా సెయింట్ ఆన్స్ స్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించాలన్నారు.

లైసెన్స్‌దారులే వాహనాలు నడపాలి: సీఐ

పులివెందుల టౌన్, జూలై 20: లైసెన్స్‌దారులే వాహనాలు నడపాలని, ప్రతి ద్విచక్రవాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని రూరల్ సీఐ బాలమద్దిలేటి పేర్కొన్నారు. శనివారం స్థానిక ముద్దనూ రు రోడ్డు సర్కిల్‌లో ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు లైసెన్స్ కలిగి వాహనాలు నడపాలన్నారు. హెల్మెట్ ధరించాలని సూచించారు. అతివేగం ప్రమాదకరమన్నారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. అనంతరం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీసీని కలిసిన నాన్‌టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

వీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాన్‌టీచింగ్ సంఘం ప్రతినిధులు


కడప (ఎడ్యుకేషన్), జూలై 20: వైవీయూలో నూతనంగా ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు చేపట్టిన కె.కృష్ణారెడ్డిని వైవీయూ నాన్‌టీచింగ్ సంఘం ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లం రాజశేఖరరెడ్డి, శివప్రసాద్, మహబాషా, రాజశేఖర్, రమణారెడ్డి, మురళీ, గౌడ్, పరమేశ్వరెడ్డి, రామసుబ్బయ్య, దానం, యోగి, గంగాధర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వీసీని కలిసిన టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు

వైవీయూ నూతన ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు చేపట్టిన కృష్ణారెడ్డిని టీఎన్ఎస్ఎఫ్ ప్ర తినిధుల బృందం శనివారం మర్యాద పూర్వకంగా కలిశా రు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం వైవీయూలో నెలకొన్న సమస్యలను వీసీ దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. విద్యార్థులకు ప్రొఫెసర్లు, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ అందుబాటులో ఉండి వారి మెరుగైన భవిష్యత్‌కు నాంది పలకాలని కోరారు. ప్రతి ప్రభుత్వ పథకం విద్యార్థులకు చేరేల చూడాలన్నారు.

యూనివర్సిటీలో పర్యటించిన టీఎన్ఎస్ఎఫ్ బృందం

టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ నేతృత్వంలో వైవీయూలోని లైబ్రరీ, క్యాంటీన్‌తో పాటు పలు విభాగాలను పరిశీలించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంబీఏ, ఎంసీఏ, కామర్స్ విభాగాలకు అదనపు బస్సు సర్వీసులు, క్యాంటీన్‌లో భోజన నాణ్యత, ధరల నియంత్రణ లైబ్రరీలో లిఫ్ట్ సదుపాయం కాల్పించాలని విద్యార్థులు కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు చేతన్ కుమార్ రెడ్డి, భరత్, అమృత్, అశోక్, అనీష్, జైదేవ్, రంజిత్, రాజేష్, ఫరీద్ పాల్గొన్నారు.

'వీసీ నియామకాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), జూలై 20: వైవీయూ వీసీ నియామకాన్ని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ గౌర్ వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు డిమాండ్ చేశారు. శనివారం వైవీయూ లో వీసీ నియామకానికి వ్యతిరేకంగా తరగతులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉపసంహరించే వరకు ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

బీసీల అభ్యున్నతికి శ్రమిస్తాం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప (మారుతీనగర్), జూలై 20: బీసీల అభ్యున్నతికి శ్రమిస్తాం అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుల ఆహ్వానం మేరకు శుక్రవారం స్థానిక పాతరిమ్స్‌లో గల బీసీ భవన్‌ను ఆయనతో పాటు ఎమ్మెల్యే మాధవి హాజరై సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కడప నగర నడిబొడ్డున బీసీ భవన్ నిర్మాణం కావడం సంతోషంగా ఉందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ప్రధాన కార్యదర్శి టి.త్రివిక్రమ్ యాదవ్ మాట్లాడుతూ బీసీ భవన్‌లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కళ్యా సుధాకర్, టీడీపీ బెస్తసాధికార కమిటీ రాష్ట్ర చైర్మన్ యాటగిరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కడప ఎమ్మెల్యే దంపతులు


కడప (మారుతీనగర్), జూలై 20: కడప జిల్లా నూతన కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో తెలుగుదేశం పార్టీ కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆమె భర్త, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. జిల్లాను ప్రగతిపథంలో నడిపించేందుకు శ్రద్ధ చూపాలని కోరారు.

బీటెక్ రవికి సమస్యల వెల్లువ


ప్రజల సమస్యలు వింటున్న బీటెక్ రవి

పులివెందులటౌన్,జూలై 20: పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి సమస్యలు వెల్లువలా వస్తున్నాయి. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. తమ సమస్యలు చెప్పుకుంటూ అర్జీలు సమర్పించారు. అక్కడి నుంచే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని బీటెక్ రవి ఆదేశాలు జారీ చేశారు.

అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు కృషి చేయండి


మాట్లాడుతున్న సీఐ భాస్కర్‌రెడ్డి

కడప (క్రైం), జూలై 20: కడప నగరంలోని వన్‌టౌన్ పరిధిలో అసాంఘిక కార్యాకలాపాల నియంత్రణకు కృషి చేయాలని సీఐ భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మహిళా సమస్యలతో పాటు మట్కా, జూదం, బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఈ సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

ఆర్టీసీ విశ్రాంత కార్మికుల పెన్షన్ పెంపును సీఎం దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే

కడప (మారుతీనగర్), జూలై 20: ఆర్టీసీ విశ్రాంత కార్మికులకు మెరుగైన పెన్షన్ పెంపు విషయమై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే మాధవీరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రీజనల్ సెక్రటరీ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఎం కార్యాలయ సభాభవనంలో విశ్రాంత ఉద్యోగుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాధవీరెడ్డితో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు నెలవారిగా వచ్చే పెన్షన్ రూ.1000, 1500గా ఉండటం వల్ల చాలా అవస్థలు పడుతున్నారన్నారు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వద్ద ప్రస్తావించి నెలకు 7.500 వచ్చేలా అసెంబ్లీలో ప్రస్తావిస్తానన్నారు. దీంతో పాటు ఆర్టీసీ అన్ని రకాల బస్సులలో విశ్రాంత కార్మికులకు ఇస్తున్న 50శాతం కన్షెషన్‌ను 75 శాతానికి పెంచేలా చేసేందుకు కృషి చేస్తామన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 20: బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కర్నూలులో ఈనెల 21న తలపెట్టిన బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

గృహ రుణ మేళాను వినియోగించుకోండి

కడప నాగరాజుపేట, జూలై 20: ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేయాలనే ఉద్దేశ్యంతో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అందజేస్తున్న రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రీవాణి కిశోర్‌కుమార్, ఏజీఎం శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం కడప నగరంలోని ఎస్‌బీఐ మాన్‌సూన్ మ్యాజిక్ పేరుతో హౌసింగ్ లోన్ మేళా నిర్వహించారు. సెప్టెంబర్ 30 వరకు కొనసాగే ఈ గృహ మేళాలో రుణానికి సంబంధించిన ప్రాసెసింగ్ ఫీజును రద్దు చేశామన్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యలను పరిష్కరించాలి

జమ్మలమడుగు, జూలై 20: జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సీనియర్ కార్షయల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌యాదవ్ అన్నారు. శనివారం జమ్మలమడుగులోని రైల్వేస్టేషన్‌లో ఆయన సమస్యలను పరిశీలించి స్టేషన్ మేనేజర్ సీతారామయ్యతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. స్టేషన్‌లో మంచినీటి సమస్య, టాయిలెట్లు, ప్లాట్‌ఫారం లెవెలింగ్ లేకపోవడం, పలు చోట్ల గుంతలు పడి ఉన్నాయన్నారు. ప్రయాణికుల కోసం మైక్ అనౌన్స్‌మెంట్, ప్లాట్‌ఫారం పొడగించాలని అన్నారు. నంద్యాల-బెంగళూరు ఇంటర్‌సిటీ ప్యాసింజర్, హైదరాబాదు-చెన్నై, నంద్యాల-రేణిగుంట డెమో రైలు కావాలని తెలిపారు. మహిళలు ఎక్కువగా ప్రయాణం చేస్తుండడంతో రాత్రి సమయాల్లో మహిళా సెక్యూరిటీగార్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వేస్టేషన్ కన్సల్టెన్సీ మెంబర్లు సిలివేరి వెంకటేశ్వర్లు, ఊసుగాండ్ల పాములేటి, సిజె.కొండయ్య, నగళ్లపాటి శ్రీనివాసులు, డి.కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినవి

నా పేరు పెద్ది సందీప్, తండ్రి పేరు పెద్ద సుబ్రమణ్యం. మాది వైఎస్ఆర్. కడపజిల్లా మైలవరం మండలం, దొమ్మరనంద్యాల గ్రామం, నాకు గుంటూరు జిల్లా తాడికొండ మండలం తాడికొండ గ్రామం డి.నెం. 1309-సి, 150 చదరపు గజాలు (ప్లాట్ నెంబర్-30) డాక్యుమెంట్ నెంబర్ 2709/2019 సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకొని నేను మా స్వగ్రామమైన దొమ్మర నంద్యాల నుండి జమ్మలమడుగు ఆటోలో వెళ్తుండగా దారి మధ్యలో పోయినవి. ఎవరికైనా ఒరిజినల్ డాక్యుమెంట్లు దొరికినచో పై అడ్రస్‌కు లేదా ఫోన్ నెంబర్‌కి తెలియజేయగలరు.

మొబైల్ నెం. 80198 50060

వరిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

కొండాపురం, జూలై 20 : వరి పంటలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ వెంకటసుబ్బయ్య, ఏవో రామాంజలరెడ్డి తెలిపారు.మండలంలోని ఏటూరు పొలంలో సాగు చేసిన వరి పంటను శనివారం వారు పరిశీలించారు.వరి నారు కొనలను తుంచి నాటడం వల్ల, కాండము తొలుచు పురుగు గుడ్లను నివారించడం ద్వారా పురుగు ఉధృతిని నివారించవచ్చునని వారు తెలిపారు. అదేవిధంగ కొండాపురం రైతుసేవా కేంద్రంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో కౌలు రైతులు ఎవరైనా ఉంటే పంట సాగు హక్కు పత్రాన్ని తమ సమీపంలోని రైతు సేవా కేంద్రంలో వీఆర్వోను సంప్రదించాలని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని పెట్టుబడి, ఖర్చులు తగ్గించుకోవాలన్నారు.ఈ కార్యక్రమం లో ఏఈవో రమేష్, అన్ని రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

'లక్ష'ణంగా వదిలేశారు..!

● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా టూరిజం రెస్టారెంట్ ● రూ.60 లక్షలకు పైగా ఖర్చు చేసి నిర్మించి వదిలేసిన వైనం

మైలవరం, జూలై 20 : పర్యాటక ప్రాంతమైన మైలవరం జలాశయం పక్కన 2011వ సంవత్సరంలో ఏపీ టూరిజం శాఖ ఆధ్వర్యంలో రూ.60 లక్షలకు పైగా ఖర్చు పెట్టి నూతనంగా నిర్మించిన రెస్టారెంట్ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మొదట్లో భవనం ప్రారంభించాక బయట పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేకంగా పరికరాలతో సౌకర్యాలను ఏర్పాటు చేశారు. రెస్టారెంట్‌లో గదులను సుందరంగా తీర్చిదిద్దారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యాటకులకు అందుబాటులో ఉండేది, కొంత కాలం తర్వాత ఆదాయం పెద్దగా లేదని మూసి వేయడంతో మందుబాబులకు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. భవనంలోని అద్దాలు ధ్వంసం చేయడంతో పాటు లోపల అధ్వానంగా దర్శనమిస్తుంది. లక్షలు ఖర్చు పెట్టి లక్షణంగా వదిలేయడంతో అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. ఒక్కప్పుడు ఒక వెలుగు వెలిగిన టూరిజం రెస్టారెంట్ ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. గదుల లోపల బయట ఎక్కడ చూసినా మందు బాటిళ్లు, నీళ్ల బాటిళ్లు, వాటర్ ప్యాకెట్స్, సిగరెట్లు, బీడి ముక్కలు, కంపచెట్లు పెరిగి, ప్రాంతమంతా అధ్వానంగా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని రెస్టారెంట్‌ను అందుబాటులోకి తేవాలని పర్యాటకులు కోరుతున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం

● **గెస్ట్‌హౌస్ సైతం..:** ఏపీ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అగస్త్యేశ్వరస్వామి కోన సమీపంలో దాదాపు కోటి రూపాయలతో నిర్మించిన వెల్‌టెక్ గెస్ట్‌హౌస్ భవనాన్ని అధునాతన కొత్త హంగులతో లోపల గదుల్ని నిర్మించారు. గండికోట, అగస్త్యేశ్వరస్వామి కోనకు వచ్చే పర్యాటకులు రెస్ట్ తీసుకొనేందుకు సౌకర్యవంతంగా ఉండేందుకు గదులను నిర్మించారు. భవనంలో పర్యాటకులకు అవసరమైన నీటి వసతి కోసం లింగాపురం సమీపం నుంచి పైప్‌లైన్ వేశారు. అయితే ప్రస్తుతం గెస్ట్ హౌస్ భవనాన్ని పట్టించుకునే నాథుడు కరువైయ్యారు. నీటి వసతి కోసం వేసిన ఇనుప పైపులు సైతం మాయమయ్యాయి. చుట్టూ కంపచెట్లు పెరిగి మూగజీవాలకు ఆవాసంగా మారింది.



రెస్టారెంట్ గదుల లోపల పగిలిన అద్దాలు, మందుబాటిళ్లు ఉన్న దృశ్యం

ఘనంగా సాయిబాబా గ్రామోత్సవం



ప్రొద్దుటూరు టౌన్, జూలై 20: రూరల్ పరిధిలోని షిరిడీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా దొరసానిపల్లెలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సాయిబాబా మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చెక్కభజన, కోలాటం, డప్పు వాయిద్యాలు, స్వామి వారి నామస్మరణల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

రాష్ట్రపతి పాలన పెట్టాలనడం జగన్ అవివేకం

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు, జూలై 20 : టీడీపీ ప్రభుత్వ ఏర్పడి 45 రోజులు పూర్తికాలేదని అప్పుడే రాష్ట్రంలో రాష్ట్ర పతి పాలన పెట్టాలని జగన్ మోహన్‌రెడ్డి మాటలు అతని అవివేకానికి నిదర్శనమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రషీద్ అనే వ్యక్తి హత్యకావింపబడితే దానిని రాజకీయ హత్యాకాండగా జగన్ అభివర్ణించి రాష్ట్రంలో దుర్మార్గపు పాలన జరుగుతుందంటూ ఆరోపిస్తున్నారన్నారు. ఇందుకోసం ఢిల్లీకి వెళ్ళి ధర్నా చేస్తామనడం ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేస్తామనడం అతన్ని అజ్ఞానానికి నిదర్శనమన్నారు. జగన్ ఐదేళ్ళ పాలనలో సాగించి హత్యలు, భూదోపిడీల మీద ఇంకా ప్రభుత్వం విచారణ ప్రారంభించక ముందే ఈ నాటకం ఆడుతున్నారన్నారు. సమావేశంలో మాజీఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ కౌన్సిలర్లు పుల్లయ్య , రామాంజనేయరెడ్డి ఎర్రన్న పాల్గొన్నారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యేలు రాయలసీమ సమస్యలు లేవనెత్తాలి

వినతిపత్రాలు అందజేసిన రాయలసీమ సంఘాల ప్రతినిధులు



పుట్టా సుధాకర్ యాదవ్ కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ప్రొద్దుటూరు జూలై 20 : శాసన సభ సమావేశాలలో రాయలసీమ సమస్యలపై అసెంబ్లీలో ఈ ప్రాంత ఎమ్మెల్యేలంతా గళమెత్తాలని రాయలసీమ విద్యావంతుల వేదిక నేతలు డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రొద్దుటూరు, మైదుకూరు ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజుల రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్‌ను వారి కార్యాలయాలకు వెళ్ళి కలిశారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి,విద్యావంతుల వేదిక కో-కన్వీనర్ మహమూద్, చైతన్య మహిళా సంఘం కన్వీనర్‌పద్మ, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు పల్లవోలు రమణ, మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, హరిత, విద్యావంతువేదిక సభ్యులు దర్బార్ బాషా, ఇస్మాయిల్ ఉన్నారు.

మహిళలపై అత్యాచారాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలి

జమ్మలమడుగు, జూలై 20: మహిళలపై అత్యాచారాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జమ్మలమడుగులోని బాలికల జూనియర్ కళాశాల ఆవరణంలో విద్యార్థినులతో వారు కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులు వయస్సుతో సంబంధం లేకుండా దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. సభ్యసమాజం తలదించుకునే సంఘటన నంద్యాలజిల్లా ముచ్చుమర్రి గ్రామంలో చిన్నారిపై అత్యాచార సంఘటన నిదర్శనమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళా విద్యార్థులు కళాశాలకుగాని, పాఠశాలలకుగానీ వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో పాఠశాలు, కళాశాలలు, ఇళ్లల్లో ఎలాంటి భయం లేకుండా మహిళలను అసభ్యకరంగా మాట్లాడడం, జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు మియా, సహాయ కార్యదర్శి మహేష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు

చాపాడు, జూలై 20: మండలంలోని భద్రిపల్లె గ్రామంలో టీడీపీ నాయకులు గుత్తి వీరనారాయణ, ఆ గ్రామ సర్పంచ్ గుత్తి మల్లీశ్వరి, గ్రామ సచివాలయ ఏఈ అరుణ్‌సాయి, గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్ శనివారం పరిశుభ్రం చేశారు. గ్రామంలో ఉన్న చెత్త, ఇతర వ్యర్థపదార్థాలను తొలగించి వీధుల్లో బ్లీచింగ్‌పౌడర్ చల్లారు. గ్రామంలో ఉన్న కంపచెట్లను ఎక్స్‌కవేటర్లతో తొలగించారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

పోరుమామిళ్ళ , జూలై 20: ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోరుమామిళ్ళ తహసీల్దార్ శిరీషా హెచ్చరించారు. రెండు రోజుల క్రితం పోరుమామిళ్ళ మండలంలోని అక్కలరెడ్డిపల్లె పంచాయతీలో సర్వే నెంబర్ 1854 ప్రభుత్వ స్థలంలో కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సుధాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కాగా తహసీల్దార్ శిరీషా శనివారం 1854 సర్వేనెంబర్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సర్వేనెంబర్‌లో దాదాపు 120 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని ఆక్రమణలకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

మొక్కుబడి తీర్చుకున్న టీడీపీ నాయకులు



దర్గా వద్ద టీడీపీ నాయకులు

ఖాజీపేట, జూలై 20: టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కమలాపురం ఫరూక్ అహ్మద్ నెల్లూరు బారాసాహిద్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందితే దర్గాకు వచ్చి పూల చాందిని సమర్పిస్తానని ఎన్నికల ముందు మొక్కుకోవడం జరిగిందని, ఆ మొక్కును ఈరోజు తీర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం షఫి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతర పీర్ల మహోత్సవం

ముద్దనూరు జూలై 20: మండల పరిధిలోని మంగపట్నం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి జాతర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు పీర్లు గ్రామంలో ఊరేగింపు, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. విశ్రాంత అధ్యాపకుడు పుల్లారెడ్డిచే పౌరాణిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు , గౌరవ విశిష్ట అతిథిగా ఏఎస్పీ సుధాకర్ పాల్గొంటారని తెలిపారు.

నేడు జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 20: దేవాంగ కల్యాణ మండపంలో ఈనెల 21వ తేదీ ఆదివారం ఉదయం జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సలీం తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో బాలబాలికలకు జూనియర్, సబ్‌జూనియర్, సేడేట్, సీనియర్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 300 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరి రమేష్, సభ్యుడు ఫయాజ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత టెట్, డీఎస్సీ శిక్షణ తరగతులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 20: స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఈనెల 22 నుంచి ఉచిత టెట్, డీఎస్సీ తెలుగు పండిట్ తరగతులు నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ తెలిపారు. శనివారం జేవీవీ కార్యాలయంలో ఉచిత శిక్షణ తరగతుల కరపత్రాలు ఆవిష్కరించారు. ఆసక్తిగల అభ్యర్థులు 9705432038 నంబరులో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు రాజేష్, మురళీగుప్త, రవిశంకర్, శర్వాణి పాల్గొన్నారు.

ఆర్డీవో ఆదేశాలు బేఖాతరు

అట్లూరు, జూలై 20: మండలంలోని నల్లాయపల్లె భూములను అక్రమార్కులు, వైసీపీ నాయకులు ఆక్రమించుకుంటున్నారంటూ పట్టాదారులు మండలంలోని పాటిమీదపల్లె ముంపువాసులు శనివారం తహశీల్దారు వేణుగోపాల్‌కు ఫిర్యాదుచేశారు. 102 సర్వేనెంబర్లు ఐదుగురు 7 ఎకరాలు 2008లో తమకు పట్టా ఇచ్చిన భూమిని కొంతమంది అక్రమార్కులు దున్నుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. జూలై 16వ తేదీన నల్లాయపల్లె భూ ఆక్రమణలపై బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించి సమగ్ర భూ సర్వే చేస్తామని పట్టాదారులకు హామీ ఇచ్చారు. ఆయన ఆదేశాలు బేఖాతారు చేస్తూ శనివారం అక్రమార్కులు నల్లాయపల్లె భూములను కబ్జా చేసున్నారని తహశీల్దారును వివరణ అడగగా జూలై 22 నుంచి నల్లాయపల్లె భూములను సమగ్ర సర్వేచేసి పట్టాదారులకు న్యాయం చేస్తామని తహసీల్దారు తెలిపారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 20: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రాష్ట్ర సగర జేఏసీ ఛైర్మన్ మాదాసు మురళి పేర్కొన్నారు. శుక్రవారం చెన్నంరాజులపల్లె మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో వ్యాపారవేత్త వర్రా మధుసూదన్‌రావు సౌజన్యంతో పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యోగానంద, సగర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వరికూటి సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షుడు నశ్యం వెంకటసుబ్బయ్య, వెంకటయ్య, సుబ్బారావు, పెంచలయ్య, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతల పూడ్చివేత

పోరుమామిళ్ళ , జూలై 20: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పోరుమామిళ్ళ ప్రధాన రహదారుల్లో గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిల్వఉండడంతో ద్విచక్ర వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న పోరుమామిళ్ళ మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎనమల సుధాకర్ ఇటుక బట్టీల వద్ద ఉన్న మట్టిని ట్రాక్టర్లతో తోలించి గుంతలను పూడ్పించారు. ఆర్అండ్‌బీ అధికారులు కూడా స్పందించి ప్రధాన రహదారుల దగ్గర ఏర్పడిన గుంతలను పూడ్పించాలని స్థానికులు కోరుతున్నారు.

